ఆర్‌జిబి ఇన్ఫోటైన్ ఉగాది కథల పోటీలో తృతీయ బహుమతి పొందిన కథ

# దృక్పథం

ఇంకో రెండు గంటల్లో 'పల్స్ 17' ప్రారంభం కానుంది.

ఇంజినీరింగు కాలేజీ విద్యార్థులూ మేనేజ్‌మెంటు వారూ కలిసి భారీ ఎత్తున వార్షికోత్సవం చేస్తున్నారు.

ప్రిన్సిపాల్ డాక్టర్ సదాశివం ఏర్పాట్లన్నీ పర్యవేక్షించి పెదవి విరిచారు. ముఖమూ వికృతంగా మారిపోయింది.

"ఇదేంటి? ఇది స్టేజా? ఇద్దరు మంత్రులు, ఎంపీగారు మన కాలేజ్ కమిటీ చైర్మన్‌గారూ వస్తోంటే ఎంత పోష్‌గా ఉండాలి? ఇలా సాదా సీదాగా లాగించేస్తే...ప్చ్ బాగోలేదు. బ్యాగ్రౌండ్ ఫ్లెక్సీలో యువతీ యువకుల ఆ ఎగురుళ్ళేవిటి? ఏం బావోలేదు. మన కాలేజీ ఘనతని చాటేలా ఉండొద్దూ? ఈ డెకరేటివ్ ప్లాంట్స్ ఏవిటప్పుడే తలలు వేలాడేశాయి? మీరేదో అదరగొడతారనుకుంటే ఇలా తగలేశారేంటి? వెరీ బ్యాడ్. వీఐపీల ముందు నా తల కొట్టేస్తున్నారు. ఇంకా అలా చూస్తూ నిలబడితే కాదు. త్వరగా ఏదోటి చేసి పరువు నిలపండి....!"

స్టాఫ్ మీదా, విద్యార్థి నాయకుల మీదా కస్సుమన్నారు. ఎన్నో సూచనలూ చేశారు. మిగిలివున్న అతికొద్ది సమయంలో అవేమీ చేయలేమని ఇరువర్గాలకీ తెలుసు. అయినా ఆయన చెప్పారు. వీరు విన్నారు.

"అతిథి మర్యాదలు ఘనంగా చేయాలి. ముఖ్యంగా మీడియా వారిని బాగా ఇంప్రెస్ చెయ్యాలి. రేపు అన్ని ఛానళ్ళలో పేపర్లలో మన కాలేజీ పేరు మార్మోగిపోవాలి. అన్నట్టు వారికిచ్చే గిఫ్టులు రెడీయే కదా?" పీఆర్వోని అడిగారు.

"రెడీ సార్. మ్యాటరూ ఫోటోలూ కూడా సిద్ధం చేశాం..."

అయినా అసంతృప్తిగా చూశారు. "క్యాంపస్ సెలక్షన్స్ గురించీ, దానికోసం మనం ఇస్తోన్న ప్రత్యేక శిక్షణ గురించీ, యూనివర్శిటీ ర్యాంకుల గురించీ ఆ నోట్‌లో రాశారా లేదా?"

"రాశాం సార్. ఒక్కసారి అటు చూడండి. గేటు దగ్గర్నుంచి స్టేజిదాకా రోడ్డుకి ఇరుప్రక్కలా అమర్చిన ఫ్లెక్సీల నిండా విజేతల ఫోటోలు వేయించాను" కించిత్తు గర్వంగా చెప్పాడు పీఆర్వో.

"లాస్టియర్ పదిహేను లక్షల ప్యాకేజ్ వచ్చిందే ఆ కుర్రాడు రాజేష్ ఫోటో వాటిల్లో ఉంది కదా?"

"ప్రవేశ ద్వారం దగ్గర ఉన్న పెద్ద ఫ్లెక్సీ అతడిదే సార్. ప్రెస్సూ పబ్లిక్కూ ఎవ్వరూ మిస్ కానంత పెద్దది అరేంజ్ చేశాను" భుజాలెగరేశాడు.

"రెస్పాన్స్ ఎలా వుంటుందో చూస్తానుగా. ఈసారి ఎమ్సెట్ ర్యాంకర్ల ఫస్ట్ ప్రిఫరెన్స్ మన కాలేజీయే అవ్వాలి. మేనేజ్‌మెంట్ కోటాకి డిమాండ్ పెరగాలి. అప్పుడే యాజమాన్యం మనల్ని గుర్తిస్తుంది. మైండిట్. సో, మన సక్సెస్ మన మార్కెటింగ్ స్కిల్స్‌మీదే ఆధారపడి ఉంది. అందుకు ఈ ఈవెంట్‌ని 100% కాదు 200% ఉపయోగించుకోవాలి...."

ఇంకేదో చెప్పబోయిన సదాశివం దృష్టి ఓ ప్రక్కగా ఉన్న టెంట్ మీద పడింది.

"అదేవిటి?" నుదురు ముడివేసి మరీ ప్రశ్నించారు.

"మన విద్యార్థులు కొందరు ఏదో సేవా కార్యక్రమం ప్రారంభించారు..."

"నాకు తెలీకుండా నా కాలేజీలో సేవలూ గీవలూ ఏంటి?"

ఆయన ముఖం ఎర్రబడింది. స్వరం తీవ్రతని సంతరించుకుంది. దాంతో పీఆర్వో గొంతులో పచ్చివెలక్కాయ పడింది.

గబగబా అటు నడిచారు ప్రిన్సిపాల్. పీఆర్వోకీ అనుసరించక తప్పలేదు.

నాలుగు చేతులు చతురస్రాకారంలో కలిసినట్టుగా వున్న బొమ్మ మధ్య 'హెల్పింగ్ హ్యాండ్స్' అని రాసి వున్న చిన్న ఫ్లెక్సీ టెంట్‌కి వేలాడుతోంది.

ఆయనకి ఒళ్ళూ పై తెలియని కోపం వచ్చేసింది. లోపలికెళ్తూనే, "వాటీజ్ దిస్ నాన్సెన్స్? వాటీజ్ గోయింగాన్ హియర్?" అరిచారు సదాశివం.

విద్యార్థుల దగ్గర్నుంచి రక్త నమూనా సేకరిస్తున్నవారూ, బ్లడ్‌గ్రూప్ టెస్టు చేస్తున్న యువకులూ అదిరిపడి చూశారు.

వారి లీడర్ ప్రహ్లాద్ ముందుకొచ్చాడు "వెల్కం సార్..."

అతడి వెనుక పదిమంది వరకూ విద్యార్థినీ విద్యార్థులు చేరి వినయంగా నిలబడ్డారు.

ఒకరు గబగబా కుర్చీ తెచ్చి వేశారు.

దాని వంక చూడలేదు. "ఇక్కడేం జరుగుతోంది" గద్దించారు.

"స్టూడెంట్స్ బ్లడ్ శాంపిల్స్ తీసుకుని, ఏ గ్రూపు రక్తమో చెప్పిస్తున్నాం సార్. రక్తదాన ప్రాముఖ్యతని వివరిస్తూ అందుకు సిద్ధపడ్డ వారి ఫోన్ నెంబర్లూ ఎడ్రస్సులూ తీసుకుంటున్నాం సార్..." ప్రహ్లాద్ వివరించాడు.

"నాకు చెప్పకుండా క్యాంపస్‌లో ఈ న్యూసెన్సేవిటి?" కోపం మరో డిగ్రీ పెరగ్గా అరిచారు.

"క్షమించండి సార్. ఇది స్వచ్ఛంద సేవా కార్యక్రమం. ప్రతి ఒక్కరూ నలుగురికైనా రక్తదానం, తద్వారా ప్రాణదానం చేసేలా ప్రోత్సహిస్తున్నాం సార్"

"స్టాప్ ద నాన్సెన్స్. మీరు విద్యార్థులు. మీ భవిష్యత్తు, ఉద్యోగం మీ చదువు మీదే, మీ ర్యాంకుల మీదే ఆధారపడి వుంది. దాన్ని గాలికి వదిలేసి ఈ సంఘ ఉద్ధరణ గోల మీకెందుకు? అవి చూసుకోడానికి ప్రభుత్వాలున్నాయి. రాజకీయ పార్టీలున్నాయి. వాటి నాయకులున్నారు. వెంటనే ఈ భాగోతం కట్టిపెట్టేసి మన 'పల్స్ 17' సక్సెస్ అయ్యేలా చూడండి. అవతల వీఐపీలొస్తోంటే ఇక్కడ ఈ పగటి వేషాలా? క్లోజిట్" ఆగ్రహంతో ఊగిపోయారు.

"సారీ సర్. క్లోజ్ చెయ్యలేం..."

ప్రహ్లాద్ స్వరంలోని దృఢత్వం విస్మయపరిచింది. ఆయన అహం దెబ్బతింది.

కోపోద్రిక్తులై రెచ్చిపోబోతోంటే పీఆర్వో అడ్డుపడ్డాడు. "గెస్ట్స్ వచ్చే టైమైంది. అనవసర గొడవ ఎందుకు సార్.."

"ఓకే బతికి పోయావ్. సీ మీ టుమారో విత్ యువర్ పేరెంట్స్..."

"బీ పాజిటివ్ సర్..." మందహాసం చేశాడు ప్రహ్లాద్.

మాడ్చేశాలా చూసి గిరుక్కున వెనుతిరిగారు.

"మీ బ్లడ్ గ్రూపేంటో తెలుసుకుంటారా సార్?" ఒకమ్మాయి ముందుకొచ్చి అడిగింది.

"బీ పాజిటివ్వే కదా సార్?" మరొకరన్నారు.

విసవిసా బయటికి నడిచారు సదాశివం. తన వెనకాల అక్కడున్న విద్యార్థులంతా నవ్వినట్టుగా అనుభూతి చెందారు. ముఖం మధ్యకు కోసిన కందగడ్డ అయ్యింది.

"నో డౌట్. వీళ్ళు దారి తప్పుతున్నారు. నాకూ కాలేజీకీ బ్యాడ్ నేమ్ తీసుకురావడం ఖాయం..." గొణుక్కున్నారు.

"మీరు భలేవారు సార్. వాళ్ళేం మత్తు పదార్థాలు సేవించట్లేదు. పబ్బుల్లో తాగి చిందులెయ్యటం లేదు..."

"ఇదీ ఒక రకమైన మత్తే. కీర్తి కాంక్ష. తప్పట్ల వ్యామోహం. వీళ్ళెవరూ సక్సెస్ కాలేరు. వ్యక్తిత్వ వికాస పుస్తకాలు నువ్వూ బోలెడు చదివి వుంటావుగా. అవేం చెబుతున్నాయి? విజయమంటే అధిక ధన సంపాదన. ఎంతెక్కువ సంపాదిస్తే అంత గొప్పగా సక్సెస్ అయినట్టు. అంటే డబ్బుతోనే విజయం లెక్కింపబడుతుంది. యూనివర్సిటీ ర్యాంకులు సాధించి, స్కిల్స్ పెంచుకుని, గొప్ప ప్యాకేజీతో జాబ్స్ సంపాదిస్తేనే అటు వాళ్ళూ, ఇటు మనమూ సక్సెస్ అయినట్టు. ఆ సంగతి వాళ్ళ చెవులు మెలేసి మరీ చెప్పడం మనందరి బాధ్యత!"

సదాశివం ఉద్రేకపడుతూ చెబుతోంటే మౌనంగా విన్నాడు పీఆర్వో.

'పల్స్ 17' కార్యక్రమం అత్యద్భుతంగా జరిగింది.

అతిథులంతా వచ్చారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో హోరెత్తించారు. ఆహుతుల్ని ఉర్రూతలూగించారు.

ముఖ్య అతిథులు కాలేజ్ మేనేజ్‌మెంటు మీద ప్రశంసలు కురిపించారు.

చైర్‌మన్ చెన్నారెడ్డి ప్రిన్సిపాల్‌ని అభినందనలతో ముంచెత్తాడు. చక్కని క్రమశిక్షణతో కాలేజీని నడిపిస్తూ, ఎన్నో విజయాలు సాధిస్తూ, కాలేజీని ఎక్కడికో తీసుకుపోతున్నాడని పొగిడారు.

సదాశివం పరమానంద పడ్డాడు. భుజాలు రెండంగుళాలు పొంగాయ్. 'హెల్పింగ్ హ్యాండ్స్' వ్యవహారం ముల్లులా గుచ్చుకుంటూ బాధిస్తోంది. లేకపోతే మరింతగా పొంగిపోయేవారే.

ఆ మర్నాడు పేపర్లలో వచ్చిన 'పల్స్' కవరేజ్ వార్తల్ని ఆనందంగా చదువుతోంటే, ప్యూను వచ్చి ఏదో చెప్పాడు. పంపించమన్నట్టు సైగ చేశారు.

ప్రహ్లాద్, అతడి తల్లీ తండ్రీ లోపలికొచ్చారు.

వాళ్ళని తీసుకుని రమ్మన్న సంగతి అప్పుడు గుర్తొచ్చింది. నిటారుగా కూర్చుని వారిని నిశితంగా పరిశీలించారు.

మధ్య తరగతి కుటుంబీకులేమో కించిత్తు బిడియంతో సంకోచిస్తూ కూర్చున్నారు. ప్రిన్సిపాల్ ఎందుకు పిలిచారో, ఏమంటారోనన్న ఆందోళన వారి ముఖాల్లో ప్రస్ఫుటంగా కన్పిస్తోంది.

"ఐసీ. మీరేనన్నమాట వీడి పేరెంట్స్. వీడ్ని మా కాలేజీలో చేర్చింది ఇంజినీర్ అవ్వాలనా లేక సామాజిక కార్యకర్తో, పొలిటీసియనో అవ్వాలనా?"

"ఇంజినీరవ్వాలనేనండి"

"సాదా సీదా ఇంజినీరు గాకుండా గొప్ప ఇంజినీరవ్వాలనుకున్నారు. అందుకనే సీ గ్రేడు కాలేజీలో గాక మా కాలేజీలో చేర్చారు. ఇక్కడ సీటొస్తే చాలు చక్కని భవిష్యత్తు, క్యాంపస్ సెలక్షనూ గ్యారంటీ అని చేర్చారు. అవునా?"

తలలాడించారిద్దరూ,

"మీరు మాపై ఉంచిన నమ్మకాన్నీ విశ్వాసాన్నీ నిలుపుకోడానికి మేమెంతో కృషి చేస్తున్నాం. ప్రయాసపడుతున్నాం. ప్రముఖ కంపెనీలని క్యాంపస్ రిక్రూట్‌మెంటుకి ఆహ్వానిస్తున్నాం. వారి వడపోతల్ని తట్టుకుని సెలక్టవడానిగ్గాను ప్రత్యేకమైన తర్ఫీదు నిస్తున్నాం. వీళ్ళ కమ్యూనికేషన్ స్కిల్స్ పెరగడానికి స్పెషల్ ప్రోగ్రాం డిజైన్ చేశాం. వాటిని ఉపయోగించుకున్న విద్యార్థులు గొప్ప గొప్ప ప్యాకేజీలు చేజిక్కించుకుంటున్నారు.

విజేతలై నిలుస్తున్నారు..”

ఆగి సాలోచనగా చూశారు సదాశివం. వారు నోరు విప్పే స్థితిలో లేరని గమనించి తనలో తను నవ్వుకున్నారు.

“మా తులసివనంలో గంజాయి మొక్క మొలిచింది. మీవాడు మా కాలేజీలో దారి తప్పిన నల్లగొఱ్ఱె. తను తప్పడమే కాదు మరికొందర్ని తన వెంట లాక్కెళ్తున్నాడు. వాళ్ళ చదువులు పాడుజేస్తున్నాడు. ఇలాంటిది మా కాలేజీలో జరగడానికి వీల్లేదు!” ఖండితంగా చెప్పారు.

“ఎక్స్‌క్యూజ్‌మీ సార్. మేం క్లాసులు ఎగ్గొట్టడం లేదు. మా ఖాళీ సమయాన్నీ సామాజిక సైట్లనీ ఉపయోగించుకుంటున్నాం. మా పరిధిలో మేం చేయగలిగిన సాయం చేస్తున్నాం. ఇతరులకు సాయపడటం నేరమంటారా సార్?” ప్రహ్లాద్ అడిగాడు.

ఆయన మొహం జేవురించింది. “పిల్లకాకివి. నీకు తెలీదు. అలాంటి గొడవల్లో తిరిగితే నీ చదువు నాశనమవుతుంది. మీ వాళ్ళు మమ్మల్ని ఆడిపోసుకుంటారు. నీ వల్ల మాకు చెడ్డపేరు వస్తుంది. అసలు ఎప్పటికప్పుడు అన్ని పేపర్లూ క్లియర్ చేస్తున్నావా? బ్యాక్‌లాగ్ ఎన్ని పేపర్లున్నాయి?”

“ఏమీ లేవు సార్”

ఉలిక్కిపడ్డారు. “ఎంత పెర్సంటేజ్‌లో వున్నావేంటి?”

“89% సార్...”

అవాక్కయ్యారు. ఊహించలేదసలు. ఆ వెంటనే సర్దుకున్నారు.

“విన్నారా? 89% అట. మేం చెప్పే చదువుకి 99% రావాలి. ఇక కబుర్లు అనవసరం. మీ అబ్బాయి పూర్తిగా చదువుకే అంకితమవ్వాలి. అలా అయితేనే ఇక్కడ చదివించండి. లేకపోతే ఇంకో కాలేజీకి మార్పించుకోండి. ఇతడ్నీ ఇతడి పద్ధతుల్నీ భరించడం నా తరం కాదు” బెదిరింపు అస్త్రం ప్రయోగించారు.

“సార్ సార్ అలా అనకండి పెద్దవారు అన్నీ తెలిసిన వారు....” కంగారు పడ్డాడు ప్రహ్లాద్ తండ్రి.

“మా కాలేజీలో ఇలాంటి పనికిమాలిన పనులకి చోటులేదు. ఇక్కడ చదువు, కెరీరు, సక్సెస్సు తప్ప మరో ధ్యాస ఉండటానికి వీల్లేదు. వింటున్నావా? నీ గురించి నీ కన్నా ఎక్కువగా మేం పట్టించుకుంటాం. ఆ సంగతి నీ పేరెంట్సుకీ తెలుసు గనుకే ఎంతో భరోసాతో ఉన్నారు. ఇక్కడి చదువు కావాలో, తనకు మాలిన ధర్మం కావాలో నువ్వే నిర్ణయించుకో” ప్రహ్లాద్‌తో నిష్కర్షగా చెప్పారు సదాశివం.

“ఒక చిన్న రిక్వెస్ట్ సార్. మన కాలేజీ విద్యార్థుల్లో ఎక్కువమంది మీ ఆలోచనా సరళిని సమర్థిస్తే సేవా కార్యక్రమానికి గుడ్‌బై చెప్పేస్తాను సార్”.

నవ్వేరు. “మా స్టూడెంట్సు బుద్ధిమంతులు. నీలా ఆవారాలు కాదు”

"మీరు రైటని అంతా ఓటేస్తే నా ఓటమిని అంగీకరిస్తాను. రేపే నోటీసుబోర్డులో పెట్టి వారి అభిప్రాయం తెలుసుకోండి సార్"

పాలిపోయిన మొహంతో చూశారు సదాశివం. తనతడ్ని ఇరుకున పెడదామని చూస్తే, అతడు తనని ఇరికిస్తున్నాడు! గోటితో పోయేది గొడ్డలి దాకా లాక్కొచ్చాడా?

సన్నగా ముచ్చెమటలు పోస్తున్నాయి. వెనక్కి తగ్గే అవకాశం లేదు. ఇది పరువు ప్రతిష్ఠల సమస్య!

తలూపి, వారిని పంపి, తల పట్టుకున్నారు.

అత్యధికులు తనని సమర్థించకపోతే? వ్యవహారం చిలికి చిలికి గాలివాన అయితే? చైర్మన్‌కి తెలిస్తే?

ఎంతగా శ్రమిస్తూ కాలేజీకెంత 'క్రేజ్' తీసుకొచ్చినా విద్యార్థుల నిరసనాగ్రహాన్ని చల్లార్చడానికి తనని బలిపశువుని చేసేస్తారు. అందులో సందేహం ఏమీ లేదు.

కంపించిపోయారు. ముచ్చెమటలు ధారలు కడుతున్నాయి. పెళ్లికెదిగిన ఇద్దరు కూతుళ్ళు కళ్ళముందు కదిలారు.

మరి సీట్లో కూర్చోలేక బ్రీఫ్‌కేస్ తీసుకుని లేచారు.

కారుని ఎలా డ్రైవ్ చేసుకుని ఇంటికెళ్ళి పడ్డారో ఆయనకే తెలీదు.

"అలా వున్నారేంటి? జరక్కూడనిదేదైనా జరిగిందా?" దెయ్యాన్ని చూసి జడుసుకున్న వాడిలా వున్న ఆయన్ని చూస్తూనే అడిగింది భార్య.

"అహహ..." టై విప్పుకుంటూ నసిగారు.

"నిన్న అంతా పొగిడారని పొంగిపోయారు. ఇవాళేమో కుంగిపోతున్నారు. చిన్నదానికే పెద్దగా స్పందిస్తారు. మీ ప్రవర్తన మీ హోదాకీ వయస్సుకీ తగ్గట్టు హుందాగా లేదు"

"ప్రైవేటు జాబుల సంగతి నీకు తెలీదు లేవే. యూనివర్శిటీ ప్రొఫెసర్‌గా రిటైరైన వాడ్ని తీసుకొచ్చి ఇంజినీరింగు కాలేజీ ప్రిన్సిపాల్‌ని చేశారు. పరిగెడుతూ గెలుస్తూ కప్పులు తెస్తున్నంతవరకూ బాగానే దువ్వుతారు. కాస్త వెనకపడినా, ఇంకేమైనా తేడాపాడాలొచ్చినా తక్షణం పీకిపారేస్తారు. ఈ హోదా ఈ వెలుగూ ఉండగానే ఎలావోలా ఇద్దరమ్మాయిల పెళ్లిళ్ళూ జరిపించేస్తే ఆ తర్వాత ఏం జరిగినా ఫరవాలేదు..."

"తప్పకుండా జరిపిస్తారు. మీరొచ్చాక కాలేజీ దివ్యంగా ఉంది. పనిచేసే వాళ్ళనెవరూ వదులుకోరు. ఊరికే నీడల్ని చూసి భయపడకండి. అభద్రతని మీ దరిదాపుల్లోకి రానివ్వొద్దు. అన్నిటికీ ఆ తిరుపతి వేంకటేశ్వరుడే ఉన్నాడు. ఆయన మీద భారం వేసి నిశ్చింతగా ఉండండి..."

భార్య మాటలు నచ్చాయి. సదాశివం ముఖంలోకి వెలుగు గబగబా ప్రాకి

వచ్చింది. "ఓకే ఓకే" అన్నారు.

'హెల్పింగ్ హ్యాండ్స్' ని మన కాలేజీలో నిషేదించడమైనది – అంటూ నోటీసు తయారు చేసి సదాశివం సంతకానికి తీసుకొచ్చాడు మేనేజరు.

అలా రాసి తెమ్మన్నది ఆయనే. కాని దాన్ని చదివిన వెంటనే చించేశారు.

'హెల్పింగ్ హ్యాండ్స్ లాంటి సంస్థలు విద్యార్థుల దృష్టిని శక్తిని దారి మళ్ళించి తమ తమ లక్ష్యాలకూ గమ్యాలకూ దూరం చేస్తాయా? – దీనిపై విద్యార్థుల అభిప్రాయాలను ఆహ్వానిస్తున్నాను' – అని కొత్తగా నోటీసు తయారు చేయించి నోటీసు బోర్డులో పెట్టించారు.

విద్యార్థి నాయకులే కాదు, విద్యార్థులు సైతం గుంపులు గుంపులుగా వచ్చి ప్రిన్సిపాల్‌ని కలిశారు.

"మేమంతా మనస్ఫూర్తిగా హెల్పింగ్ హ్యాండ్స్‌ని సపోర్టు చేస్తున్నాం. ఇలాంటి మంచి కాన్సెప్ట్‌తో ముందుకొచ్చిన ప్రహ్లాద్‌ని అభినందిస్తున్నాం. దీన్ని ఇతర కాలేజీలకూ విస్తరించడానికి సహకరిస్తాం. వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విట్టర్ తదితర మాధ్యమాల ద్వారా ప్రాచుర్యం కల్పిస్తాం. రక్తదాతలకూ రక్త గ్రహీతలకూ, మధ్య వారధిగా నిలుస్తాం. ఇదో ఉద్యమ రూపం దాల్చాలని ఆకాంక్షిస్తున్నాం" అన్నారు.

గుటకలు మ్రింగారు. ఆపైన పెదవి కొరుక్కున్నారు సదాశివం.ఆనవసరంగా ప్రహ్లాద్ ఇమేజ్ పెంచానేమోనని మథన పడ్డారు.

సీనియర్ ప్రొఫెసర్ విష్ణుమూర్తి వచ్చారు. ఏదో చెప్పడానికొచ్చినట్లు అర్థమై కించిత్తు ఫీలవుతూనే ఏవిటన్నట్టు చూశారు.

"విద్యార్థుల్లో సేవాభావం, పరోపకార భావన పెంపొందించడమూ గురువు బాధ్యతే. విద్యార్థి ఆల్‌రౌండ్ గ్రోత్‌కి మన కాలేజీ వేదికైతే మనం గర్వించాలి తప్ప అడ్డుపడకూడదు. అణగద్రొక్కరాదు. అలాంటి వారిని ప్రోత్సహించడం మన బాధ్యత. కర్తవ్యం. విశాల దృక్పథంతో దూరదృష్టితో ఆలోచించండి. హ్రస్వదృష్టి, నెగెటివ్ యాటిట్యూడ్ హానికరం!"

దాన్ని మందలింపుగానే భావించారు సదాశివం. ఆయన 'ఇగో' మరింతగా హర్ట్ అయ్యింది. వీళ్ళంతా ఏకమై తనకి వ్యతిరేకంగా మేనేజ్‌మెంటుకి మోసేస్తారేమోనన్న భయం ఆయన్ని నిలువునా ఊపేస్తోంది. తిన్నగా ఆలోచించనివ్వట్లేదు.

ఎలాగైనా సరే ప్రహ్లాద్ అండ్ కో ని దెబ్బతీసి, తను బలంగా పాతుకుపోవాలన్న కోరిక పుట్టి గబగబా పెరగసాగింది.

రకరకాల మార్గాల గురించి ఆలోచిస్తూ కాటు వేయడానికి సిద్ధంగా ఉన్న త్రాచులా మారారు.

'ఈసీ' హెడ్డాఫ్ ద డిపార్ట్‌మెంట్ కృష్ణవేణిని పిలిపించారు.

"మీ స్టూడెంట్ ప్రహ్లాద్ మీద నాకు సదభిప్రాయం లేదు. ఇంటర్నల్స్‌లో కొంచెం నొక్కెయ్యండి..."

ప్రిన్సిపాల్ మాటలకి దిగ్భ్రమగా చూసింది. 'ఎప్పుడూ లిబరల్‌గా వుండమని చెప్పే ఆయనేనా ఈయన?' – అనుకుంది.

"అతడికి యూనివర్శిటీ ర్యాంక్ ఎక్స్‌పెక్ట్ చేస్తున్నాం సార్..." లో గొంతుకతో చెప్పింది.

"అయినా సరే..." తను మొండిగా ప్రవర్తిస్తున్నట్టు ఆమె భావిస్తుందేమో నని అనుమానించారు. "అతడు మా పెద్దమ్మాయితో మిస్‌బిహేవ్ చేశాడు. మోరల్స్ లేనివాడు ఎంత తెలివైన వాడైనా సరే ఎదగనివ్వకూడదు. లెటజ్ టీచ్ హిమ్ ఎ లెసన్..."

అపనమ్మకంగా చూసి, ఆపైన తలాడించి, వెళ్ళిపోయిందామె.

చిన్నగా నిట్టూరుస్తోంటే ల్యాబ్ అసిస్టెంటు, తిరుపతి వెళ్ళొచ్చానని చెప్పి లడ్డూ ప్రసాదం, టీటీడీ వారి డైరీ కానుకగా ఇచ్చాడు.

దాని మీది శ్రీనివాసుడి రూపం చూడగానే మదిలో పాపభీతి కదిలి మెలి తిప్పింది!

మరి నాల్రోజులు తిరక్కుండానే ఆయన పెద్దమ్మాయి పెళ్ళి సడన్‌గా కుదిరింది. వరుడు ఎన్నారై. అమ్మాయిని చూడటం, నచ్చటం, వారం రోజుల్లో ముహూర్తం పెట్టుకోవడం చకచకా జరిగిపోయాయి.

పెళ్ళి పనుల్లో పడి ప్రహ్లాద్ సంగతి ప్రక్కన పెట్టేశారు సదాశివం.

పెళ్ళిలో లోపం జరిగితే వియ్యాలవారు రంకెలేస్తారేమోనని భయపడుతూ ప్రతీ పనీ ఒకటికి రెండుసార్లు చెక్ చేస్తున్నారు. అందర్నీ జాగ్రత్తంటూ హెచ్చరిస్తున్నారు.

పెళ్ళి ఘనంగా జరిగింది. బంధుమిత్రులే కాదు కాలేజీ స్టాఫ్ కూడా తలో చెయ్యీవేసి ఆయన్ని గట్టెక్కించారు.

చైర్మన్ చెన్నారెడ్డి భార్యా సమేతంగా వచ్చారు. వధూవరుల్ని ఆశీర్వదించాక వియ్యాల వారి ముందు సదాశివాన్ని విపరీతంగా పొగిడేశారు.

"ఈయన మా కాలేజీకి ప్రిన్సిపాల్‌గా వచ్చాక మా కాలేజీ దశ తిరిగిపోయింది. మార్కుల్లో ఉద్యోగాల్లోనే కాదు సేవా కార్యక్రమాల్లో సైతం ఫస్టున నిలిపారు. మొన్న మా బంధువులతనికి హార్ట్ ఆపరేషన్ చెయ్యడానికి రక్తం అవసరమైతే మా కాలేజీ విద్యార్థులే ఇచ్చారట. మరో రోగి కోమాలో కెళితే ఎవరెవర్నో అర్థించి తెచ్చి ఆర్థిక సాయమూ చేశారట. వాళ్ళు మా కాలేజీనీ, నన్నూ పొగిడేసి, 'మీ ఋణం తీర్చుకోలేం' అంటోంటే నాకు నోట మాట రాలేదు. ఎంత డబ్బు పోస్తే మాత్రం అలాంటి అభిమానం దక్కుతుంది? నిజంగా మా విద్యార్థులంత గొప్పవాళ్ళైనందుకు నాకెంత గర్వంగా ఆనందంగా వుందో

మాటల్లో చెప్పలేను. ఇదంతా సదాశివం ప్రోత్సాహం వల్లే, ఈయన స్ఫూర్తితోనే సాధ్యమైంది" అన్నారు.

అంతటితో ఆగలేదు. సదాశివానికి షేక్ హ్యాండిచ్చి మనస్ఫూర్తిగా అభినందించారు. ఆయన కలవరపడ్డారు. ఇబ్బందిగా నవ్వారు.

పెళ్లి కార్యక్రమం, భోజనాలు పూర్తయ్యాయి.

అర్ధరాత్రి వేళ మగపెళ్లివారిని బస్సెక్కించారు. కూతురికి కన్నీటి వీడ్కోలిచ్చారు.

కళ్యాణమండపంలో అన్నీ సర్దుకుని ఇంటికెళ్ళారో లేదో ఫోన్ వచ్చింది.

సిటీ రింగ్‌రోడ్‌లో పెళ్లివారి బస్సుకి యాక్సిడెంటయ్యిందిట! అందర్నీ ఆసుపత్రిలో చేర్చారట!

నిలువునా కంపించిపోయారు సదాశివం దంపతులూ, బంధువులూ.

దు:ఖోద్ధృతికి అడ్డుకట్ట వేస్తూ భగవంతుణ్ణి పదేపదే ప్రార్థిస్తూ మూడు కార్లలో ఆసుపత్రికెళ్ళారు.

బస్సులోని వారందరికీ గాయాలయ్యాయి. స్పాట్ డెత్స్ లేవుగాని ముగ్గురి పరిస్థితి విషమంగా ఉందన్నారు. వారిలో పెళ్లికూతురూ ఉంది!

పెనుకెరటంలా ముంచెత్తిన దు:ఖాన్ని నిలువరించ లేక సర్వం కోల్పోయిన వారిలా ఆసుపత్రి లాంజ్‌లో కూలబడ్డారు సదాశివం. ఆయన భార్యా, చిన్న కూతురూ, బంధువులూ శోకాలు తీయసాగారు.

ఆసుపత్రి లోపల్నుంచి పది పదిహేనుమంది యువతీయువకులు అటుగా వచ్చారు. వారంతా నీరసంగా ఉన్నారు. కాని మోముల్లో ఏదో తెలీని తృప్తి, ఆనందం మెరుస్తున్నాయి.

వారిలోని కొందరు తన కాలేజీ విద్యార్థులే. వారివంక ప్రశ్నార్థకంగా చూశారు సదాశివం.

"వీళ్ళందర్నీ మీరు అప్రిసియేట్ చెయ్యాలి..." వాళ్ళతో బాటు వచ్చిన డాక్టర్ అన్నాడు.

అయోమయంగా చూస్తూ బుర్ర గోక్కున్నారు.

"సోషల్ నెట్ వర్కింగ్ ద్వారా, ఫోన్ల ద్వారా మెస్సేజ్ లందుకుని రాత్రికి రాత్రే వీళ్ళంతా ఎక్కడెక్కడ్నుంచో వచ్చి రక్తదానం చేశారు. వీళ్ళు టైముకి వచ్చి సాయపడకపోయి వుంటే చాలా ప్రాణాలని కాపాడలేక పోయేవాళ్ళం..."

కన్నీటి పొరలోంచి చూశారు సదాశివం. అస్పష్టంగా కన్పించారంతా.

ఇంతలో ఒక విద్యార్థి ముందుకొచ్చాడు. "నమస్తే సార్. మేం మన కాలేజీ 'హెల్పింగ్ హ్యాండ్స్' వాళ్ళం. మీరీ సమయంలో ఇక్కడ...।"

"మీరంతా రక్తదానం చేసింది వీరి బంధువులకే" అని చెప్పి, తిరిగి సదాశివం వంక తిరిగి అన్నాడు డాక్టర్.

"నిస్వార్థంగా స్వచ్ఛంధంగా ముందుకొచ్చి ప్రాణదానం చేసిన వీళ్ళందరికీ హేట్సాఫ్ చెప్పాలి. వీరే మనుషుల్లో వుండే దేవుళ్ళు. అన్నట్టింకో సంగతి. మీ అమ్మాయిది బీ నెగిటివ్ అని చాలా అరుదైన బ్లడ్ గ్రూప్. అదృష్టవశాత్తూ వీరిలో ఒక యువకుడిది అదే గ్రూపు. టైముకొచ్చి భలే సేవ్ చేశాడు. అదిగో అతడే...।"

అటువైపు చూశారు సదాశివం.

ప్రహ్లాద్।

రక్తం బీ నెగిటివ్. దృష్టి బీ పాజిటివ్!

కళ్ళు కారుమేఘాలై వర్షిస్తోంటే గబగబా అతడికి ఎదురెళ్ళారు. "మా అమ్మాయికి..." ఆ పై మాటలు గొంతులోనే పూడుకుపోయాయి. కన్నీళ్ళు వరదయ్యాయి.

"ఆందోళన పడకండి సార్. తప్పకుండా రికవర్ అవుతుంది. గాడ్డీజ్ గ్రేట్!"

"నీలాంటి మనిషే గ్రేట్. నీకు ప్రహ్లాద్ అని పేరు పెట్టిన నీ తల్లిదండ్రుల ఆశలకి, ఆకాంక్షలకి చెయ్యెత్తి నమస్కరిస్తున్నాను...!"

ఆయన గుండెలోతుల్లోంచి వచ్చాయా మాటలు.

స్నిగ్ధంగా నవ్వేడు ప్రహ్లాద్.

ఆ నవ్వు వెన్నెల వానలా, ఆశ నడకలా, అమృతధారలా కన్పించింది సదాశివానికి!

*　*　*

**(ఆర్జీబీ ఇన్ఫొటెయిన్.కామ్ జూన్-2017)**